# జపాకుసుమం

తెలతెలవారేసరికి చౌక్‌లోని గాంధీగారి విగ్రహంముందు కేరుకేరుమనే ఓ పసిగుడ్డు. పుట్టి ఈ భూమ్మీదపడి ఇరవైనాలుగ్గంటలైనా అయిందోలేదో, అప్పుడే బజారుపాలయిన బిడ్డ. వచ్చేపోయేవాళ్ళ నందరినీ ఇట్టే అకర్షిస్తున్నది.

మురుగొంతెనకింద చేపలు పడుతుంటేనే జనం నిలబడి చూస్తారు. ఇంక నట్టనడివీధిలో – అందులోను జాతిపిత గాంధీగారి దివ్యపాదాల సన్నిధిని – అపుడే కుసుమించిన ఓ పుష్పం రాలిపోతుంటే చూస్తూ విస్తుబోరా ?

వస్తూపోతున్నజనం ఎవరికితోచింది వారు సెలవిస్తున్నారు.

సుబ్బావధాని : కలికాలంబాబూ కలికాలం ! పాపం పండబట్టే ఇన్ని విడ్డూరాలు చూస్తున్నాం. ఏజన్మలో ఏపాపం చేసుకుందో, ఇప్పుడీవిధాన కట్టికుడుపుతున్నది. అందుకే చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవఅంటారు. కర్మనెవరైనా తప్పించగలమా ? అంటూ కదిలిపోయాడు విభూతి పెండెకట్లు సవరించుకుంటూ.

రామారావు : కర్మటకర్మ. ఎవరికర్మ ? ఇది ఈ దౌర్భాగ్యదేశానికి పట్టినకర్మ. ఎవరోచేసిన తప్పుకు అన్నెంపున్నె మెరగని ఈ పసిపాప అనుభవిస్తున్నది. ఎందు కనుభవించాలి ? తల్లిదండ్రులు చేసిన తప్పుకు పిల్లలెలా బాధ్యులవుతారు? అనుకుంటూ రోషం పొడుచుకొచ్చినవాడిలా సైకిలెక్కి చకచక సాగిపోయాడు.

హనుమాయమ్మ : మగవాడికి బుద్ధిలేకపోతే ఆడదానికుండొద్దూ ? మగవాడికేం ? మహారాజులా తిరుగుతాడు, పోతాడు. మరి ఆడదానిమాటో ? అరిటాకొచ్చి ముల్లుమీదపడ్డా, ముల్లొచ్చి అరిటాకుమీదపడ్డా నష్టపోయేది అరిటాకేనన్న జ్ఞానం ఆడదానికుండొద్దా అని? ఛీ ఛీ ! మాకాలంలో ఇలాంటివి ఎరగమమ్మా. నవమాసాలు మోసి, రక్తాన్నిపంచిచ్చి, కడుపుచించుకుని కన్నచేతులతో ఇంత పసిగుడ్డునెలా వదిలిపెట్టి వెళ్ళగలిగిందో ఆతల్లి ? అంటూ చీదేస్తూ మార్కెట్టువేపు ఈడ్చుకుంటూ ఈడ్చుకుంటూ వెడలనడిచింది.

లోకనాథం : ఈ దేశంలో ఆడదానికామాత్రం జ్ఞానంఉంటేగా ? ఆడదంటే వంటింటి కుందేలని భావిస్తాం. ఆడదానికే చదువుసంధ్యలుంటే ఇలాగవునా? బొడ్లోచెయ్యేసి, ఇందుకు కారణభూతుడైన ఆ తండ్రిగాణ్ణెవణ్ణో నిలబెట్టి అడక్కపోనా ? అమాయకురాలైన ఆడదేంచేస్తుంది- ఆ మగగాడిదకు బుద్ధుండాలిగాని ? రేపు నలుగురేమంటారోనని, లోకం జెముడుకాకై పొడుస్తుందని – పాపమా యిల్లాలు కడుపుతీపిని సైతం తెంచుకున్నది. అంతకన్న మరేంచేస్తుందీ పాడులోకంలో? అనుకుంటూ కుంటికాలెగరేస్తూ ముందుకుసాగాడు.

జ్ఞానానందం : ఇదంతా ఈ ఇంగ్లీషు చదువులవల్ల వచ్చిన ప్రళయమే. ఆడదేమిటీ మగాడేమిటీ? ఎల్లలు చెరిగిపోయాయనుకోండి. ప్రాణికి నీళ్ళు తాగడమెంతో సెక్సుకూడా అంతేనట. ఇన్ని చదువుకున్న పిల్లలు చెడిపోక చస్తారా ? అంటూ పొడుంపట్టు బిగించి పక్కదారి పట్టాడు.

మరో పక్కదారినుంచి వస్తున్న కుటుంబనియంత్రణోద్యోగి ఒకాయన ఈ దృశ్యాన్నిచూసి పరమవిస్తుపోతూ 'అయితే మా సాధనాలింకా తగిన ప్రచారంలోకి రానేలేదన్నమాట' అనుకుంటూ ముక్కుమీద వేలేసుకున్నవాడై నిశ్చలంగా నిలబడిపోయాడు.

అంతా నిలబడి తమకుతోచిన నాలుగుమాటలూ అనేసి దులిపేసుకు వెళ్ళిపోయినవారేగాని, ఒక్కరూ ఆ పసికందు పేగులలోని ఆక్రందనను విన్నవారుకారు. అప్పటికే పదముగ్గురు బిడ్డల తల్లియైన కూరగాయల అప్పలమ్మ 'నాకేంబరువా? నా పద్నాలుగో బిడ్డనుకుంటా' నంటూ ఆలేచిగురు బిడ్డను తన చిరుగుపొత్తిళ్ళల్లోకి ఆప్యాయంగా తీసుకుంది.

ధనంజయ